# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 344 శనివారం 28 సెప్టెంబర్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## బీసీల గణన తర్వాతే
# స్థానిక ఎన్నికలు



- స్థానిక సంస్థలు ఎన్నికలు తరుముకొస్తున్న వేళ దీనిపై ప్రభుత్వం ఏం చేయబోతోందనే చర్చ
- త్వరలోనే కులగణనకు సంబంధించిన ప్రకటన వస్తుందన్న టీపీసీసీ చీఫ్
- తెలంగాణలో బీసీలకు అండగా ఉండటంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉంటుంది
- మూడు నాలుగు రోజుల్లో కీలకమైన కులగణన గైడ్‌లైన్స్

హైదరాబాద్

దేశవ్యాప్తంగా కులగణన చేపయాలని పట్టుబడుతున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇప్పటి వరకు ఆ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థలు ఎన్నికలు తరుముకొస్తున్న వేళ దీనిపై ప్రభుత్వం ఏం చేయబోతోందనే చర్చ అయితే నడుస్తోంది. ఇలాంటి టైంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అన్నింటిపై చాలా మందిలో ఉన్న అనుమానాలపై క్లారిటీ ఇచ్చారు. హైదరాబాద్లో జరిగిన ఓ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్కు అనుగుణంగా సమగ్ర కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై జరిగిన ఈ సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే కులగణనకు సంబంధించిన ప్రకటన వస్తుందని అన్నారు. తెలంగాణలో బీసీలకు అండగా ఉండటంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందు - మిగతా3లో



## ఎన్నికల వేళ.. కాంగ్రెస్ పార్టీ కొరడా

- 13 మంది నాయకులపై క్రమశిక్షణా చర్యలు
- ఆరేళ్ల పాటు పార్టీ నుంచి వారిని బహిష్కరిస్తూ ఆదేశాలు జారీ
- ఇండిపెండెంట్లుగా బరిలోకి దిగడంతో కాంగ్రెస్ ఈ క్రమశిక్షణా చర్యలు
- ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వచ్చినట్లు ఒక ప్రకటన

## 500 కోట్ల పెరుగుదలపై
# విజిలెన్స్ గురి

- అంచనాలను అప్పటి ప్రభుత్వం అమాంతంగా పెంచేసిందా?
- నిర్మాణానికి 1000 కోట్లు దాటేసిందా?
- బీఆర్ఎస్ పార్టీకి కష్టాలు రెట్టింపు అవుతున్నాయి.
- ఓ వైపు కాళేశ్వరం.. ఇంకోవైపు విద్యుత్ కోనుగోళ్ల అంశం.
- మరోవైపు వరంగల్ టిమ్స్ నిర్మాణంపై విచారణలు




హైదరాబాద్

తెలంగాణ సెక్రటేరియేట్ నిర్మాణానికి ఖర్చు ఎంత? అంచనాలను అప్పటి ప్రభుత్వం అమాంతంగా పెంచేసిందా? నిర్మాణానికి 1000 కోట్లు దాటేసిందా? ఐటీ సామాగ్రికి సైతం అదనంగా ఖర్చు చేసిందా? ఆ ఖర్చుని చూసి అధికారులు నోరెళ్లబెట్టారా? తాజాగా అందుకున్న సమాచారం మేరకు విజిలెన్స్ విచారణ జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి కష్టాలు రెట్టింపు అవుతున్నాయి. ఓ వైపు కాళేశ్వరం.. ఇంకోవైపు విద్యుత్ కోనుగోళ్ల అంశం.. మరోవైపు వరంగల్ టిమ్స్ నిర్మాణంపై విచారణలు జరుగుతున్నాయి. ఈ జాబితాలోకి తెలంగాణ సెక్రటేరియేట్ చేరిపోయినట్టు తెలుస్తోంది. - మిగతా3లో

## కేరళలో రెండో మంకీ పాక్స్ కేసు నమోదు

- దేశంలో మూడోది.. వెల్లడించిన కేరళ ఆరోగ్య శాఖ
- విదేశాల నుంచి ఎర్నాకులం తిరిగి వచ్చిన వ్యక్తికి వ్యాధి
- ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడి



## భారత్‌కు బిగ్ బూస్ట్

- భారత్ ప్రయత్నాలకు అంతర్జాతీయంగా మద్దతు
- ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వంకై యూకే మద్దతు
- యూఎన్ఎస్‌సీలో మరిన్ని దేశాలు ప్రాతినిధ్యం వహించాలి
- భద్రతా మండలిలో తగినన్ని సభ్యదేశాలు లేనంతవరకూ ప్రతిపక్ష ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు సాగడం కష్టం.
- ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌లో బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్



## కేసీఆర్ పాలనలో తెలంగాణకు చేసింది ఏంటంటే శూన్యం



- అధికారంలో ఉంటే ఒకలా.. అధికారం కోల్పోతే మరోలా తాము మాట్లాడం
- మూసీ అక్రమ నిర్మాణాలపై మంత్రి పొన్నం
- మూసీ రివర్ బెడ్ నివాసాల సర్వే జరుగుతుంది
- అక్రమ కట్టదాలు అయినా.. ఇళ్లను కోల్పోయిన వారికి పునరావాసం కల్పిస్తాం
- ఎన్నికలకు ముందు రింగ్ రోడ్డును రూ. 7వేల కోట్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం అమ్ముకుంది



## ఆ ఐదు రాష్ట్రాలే ... దేశాభివృద్ధికి కీలకం

- రాబోయే ఐదేళ్లలో మూడో స్థానానికి చేరుకుంటామన్న మోదీ
- దేశ ఆర్థికాభివృద్ధిలో దేశంలోని కీలకంగా వ్యవహరిస్తున్న పలు రాష్ట్రాలు
- దేశ తలసరి ఆదాయాన్ని మించి ఆ రాష్ట్రాల తలసరి ఆదాయం
- దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలు కీలకం

## పురాతన మెట్ల
# బావులకు మహర్దశ

- రాష్ట్ర పర్యాటక శాఖ ఒప్పందం..
- ఇకపై పురాతన బావులను ప్రక్షాళన చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు
- ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్ధరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం
- మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం
- హైదరాబాద్ సంస్కృతి ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి



హైదరాబాద్

నగరంలో పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పురాతన కట్టడాలు కాపాడడమే లక్ష్యంగా సీఐఐతో రాష్ట్ర పర్యాటక శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఈ కీలక ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా పురాతన బావులు దత్తత తీసుకునేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ రంగ సంస్థలు ముందుకొచ్చాయి. - మిగతా3లో

## నేడు హైదరాబాద్‌కు
# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు
- నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముర్ము
- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- ఉదయం తొమ్మిది గంటల నుంచి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు
- బేగంపేట నుంచి బొల్లారం వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్న అడిషనల్ సీపీ



# ఢిల్లీ మున్సిపల్ స్టాండింగ్ కమిటీ బీజేపీ కైవసం

115 ఓట్లతో బీజేపీ అభ్యర్థి గెలుపు, ఆప్ అభ్యర్థికి ఓట్లు నిల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ స్టాండింగ్ కమిటీకి ఖాళీ అయిన ఏకైక సీటును బీజేపీ కైవసం చేసుకుంది. ఆ పార్టీ అభ్యర్థి సుందర్ సింగ్ 115 ఓట్లు గెలుచుకోగా, ఆమ్ ఆద్మీ పార్టీ పార్టీ అభ్యర్థికి ఒక్క ఓటు కూడా రాలేదు. 'ఆప్' అధిష్ఠానం నిర్ణయం మేరకు ఆ పార్టీ కౌన్సిలర్లు ఈ ఎన్నికలను బహిష్కరించగా, కాంగ్రెస్ సైతం ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయింది. దీంతో పోటీ లేకుండానే బీజేపీ అభ్యర్థి గెలుపొందారు. అడిషనల్ కమిషనర్ జితేంద్ర యాదవ్ ఈ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు.

**ఏం జరిగింది?**

బీజేపీ నేత కమల్‌జిత్ షెరావత్ ఇటీవల వెస్ట్ ఢిల్లీ ఎంపీగా ఎన్నిక కావడంతో ఎంసీడీ స్టాండింగ్ కమిటీ సభ్యుని పదవికి ఖాళీ ఏర్పడింది. గత గురువారంనాడు జరిగిన ఎంసీడీ సమావేశంలో ఎంసీడీ స్టాండిగ్ కమిటీ ఎన్నికను అక్టోబర్ 5వ తేదీకి మేయర్ షెల్లీ ఒబెరాయ్ వాయిదా వేశారు. అయితే లెఫ్టినెంట్ గవర్నర్ ఈ వాయిదాను తోసిపుచ్చుతూ శుక్రవారం ఒంటిగంటకు ఎన్నికలు నిర్వహించాలంటూ ఎంసీడీ కమిషనర్‌ను ఆదేశించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ గురువారం అర్ధరాత్రి ఆదేశాలు జారీ చేశారు. కమిటీ ఆరో సీటు ఎన్నికకు ప్రిసైడ్ చేయాలని అడిషనల్ మునిసిపల్ కమిషనర్ జితేంద్ర యాదవ్‌ను ఆదేశించారు. అయితే, ఇంత



స్వల్ప వ్యవధిలో ఎన్నికకు ఆదేశాలివ్వడం చట్టవిరుద్ధమని, షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 5న ఎన్నికలు జరపాలని మేయర్ ఒబెరాయ్ డిమాండ్ చేసారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాశారు. అయితే, ఎల్జీ ఆదేశాలకే కట్టుబడి స్టాండింగ్ కమిటీ సభ్యుని ఎన్నికను కమిషనర్ చేపట్టడంతో ఓటింగ్‌కు 'ఆప్' కౌన్సిలర్లు దూరంగా ఉండిపోయారు. తాజా ఎన్నికతో ఎంసీడీలోని 18 మంది సభ్యుల స్టాడింగ్ కమిటిలో బీజేపీ బలం10కి చేరింది. ఆప్‌కు 8 సీట్ల బలం ఉంది.

# భారత్‌కు బిగ్ బూస్ట్

ప్రపంచ శాంతి స్థాపనే లక్ష్యంగా ఏర్పాటైన ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ దిశగా ప్రధాని మోదీ ప్రపంచ దేశాల మద్దతు కూడగడుతున్నారు. భారత్ ప్రయత్నాలకు అంతర్జాతీయంగా మద్దతు లభిస్తోంది. ఇప్పటికే పలు దేశాలు భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం మద్దతు ప్రకటించాయి. తాజాగా ఈ జాబితాలోకి యూకే కూడా వచ్చి చేరింది. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌లో బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ మాట్లాడుతూ.. యూఎన్ఎస్‌సీలో మరిన్ని దేశాలు ప్రాతినిధ్యం వహించాలని పేర్కొన్నారు. 'భద్రతా మండలిలో తగినన్ని సభ్యదేశాలు లేనంతవరకూ ప్రతిపక్ష ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు సాగడం కష్టం. కాబట్టి భద్రతామండలిని మరింత పటిష్టం చేయాలి. ఇందులో భాగంగానే శాశ్వత సభ్యత్వ దేశాల సంఖ్యను పెంచాలి. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలుగా భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీ ఉండాలని కోరుకుంటున్నాం. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు



ప్రాతినిధ్యం కల్పించాలి' అని అన్నారు. అంతకుముందు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రన్ స్పందించిన విషయం తెలిసిందే. జనరల్ అసెంబ్లీలో మెక్రాన్ ప్రసంగిస్తూ.. యూఎన్ఎస్‌సీ విధానాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని మెక్రాన్ అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిలో భారత్‌కు మద్దతు ప్రకటించారు. యూఎన్ఎస్‌సీ సమర్థతను పునరుద్ధరించడానికి ఈ మార్పులు తగినవి అని పేర్కొన్నారు. ఇక గత వారం ఐరాస భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి అమెరికా కూడా మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక అమెరికన్ టైకూన్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సైతం గతంలోనే భారత్‌కు మద్దతు ప్రకటించారు. కాగా, భద్రతా మండలిలో భారత్‌కు సాధారణ సభ్యత్వం మాత్రమే ఉంది. భద్రతా మండలిలో ప్రస్తుతం చైనా, అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యా దేశాలు శాశ్వత సభ్య దేశాలుగా కొనసాగుతున్నాయి. ఈ ఐదు దేశాలకు ప్రత్యేకంగా వీటో పవర్ ఉంటుంది. మండలి సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను ఈ ఐదు దేశాల్లో ఏ ఒక్క దేశం అభ్యంతరం వ్యక్తం చేసినా సరే ఆ నిర్ణయం వీగిపోతుంది. శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఐదింటిలో నాలుగు మద్దతు ఇస్తున్నా.. చైనా మాత్రం భారత్ ప్రయత్నాలకు అడ్డుపడుతోంది.

# ఆ ఐదు రాష్ట్రాలే ... దేశాభివృద్ధికి కీలకం

**న్యూఢిల్లీ :** ప్రపంచంలో ఐదో ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. రాబోయే ఐదేళ్లలో మూడో స్థానానికి చేరుకుంటామని అంటున్నారు ప్రధాని మోదీ. ఈమేరకు ఆయన చర్యలు కూడా చేపడుతున్నారు. అయితే దేశ ఆర్థికాభివృద్ధిలో దేశంలోని పలు రాష్ట్రాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. దేశ తలసరి ఆదాయాన్ని మించి ఆ రాష్ట్రాల తలసరి ఆదాయం ఉంది. దీంతో దేశ జీడీపీ వృద్ధిలో కూడా ఆ రాష్ట్రాలే కీలకంగా మారాయి. గతంలో దేశ ఆర్థికాభివృద్ధిలో మహారాష్ట్ర కీలకంగా ఉండేది. కానీ ఇటీవల ఆ దేశ తలసరి ఆదాయం క్రమంగా తగ్గుతోంది. దీంతో దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. దేశ జీడీపీలో 30 శాతం వాటా ఈ రాష్ట్రాలే కలిగి ఉన్నాయి. 1991 నాటి జాతీయ సగటుకన్నా ఎక్కువ. ఇక మహారాష్ట్ర వాటా 15 శాతం నుంచి 13.3 శాతానికి తగ్గింది.తలసరి ఆదాయంలో తెలంగాణ, ఢిల్లీ, హర్యాన దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయి. అత్యంత సంపన్న రాష్ట్రాలుగా నిలిచాయి. బిహార్, ఉత్తర ప్రదేశ్ అత్యల్ప జీడీపీతో చివరిస్థానంలో ఉన్నాయి. దీంతో దక్షిణాది రాష్ట్రాలే దేశ జీడీపీ వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇక ప్రాంతీయ అసమానతలు పశ్చిమ బెంగాల్ వంటి పేద రాష్ట్రాల్లో కొనసాగుతున్నాయి. కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు దక్షిణాదిలో గణనీయమైన ఆర్థిక పురోగమనాన్ని సాధించాయి.2021, సెప్టెంబర్ 25న



విడుదల చేసిన ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక ప్రకారం.. జాతీయ సగటులో తలసరి ఆదాయం ఆధారంగా అత్యంత ధనిక రాష్ట్రాలుగా ఐదు రాష్ట్రాలు గుర్తింపు పొందాయి. 2014లో ఏర్పడిన తెలంగాణ అతి తక్కువ కాలంలోనే ధనిక రాష్ట్రాల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. ఢిల్లీ, హర్యానా రెండు, మూడో స్థానంలో ఉన్నాయి. మహారాష్ట్ర, భారతదేశ జీడీపీలో కీలక కంట్రిబ్యూటర్‌గా మిగిలిపోయినప్పటికీ, తలసరి ఆదాయంలో మొదటి ఐదు స్థానాల్లో స్థానం పొందలేదు.

తెలంగాణ: 176.8%, ఢిల్లీ: 167.5%, హర్యానా: 176.8%, మహారాష్ట్ర: 150.7%, ఉత్తరాఖండ్: 145.5%

**తలసరి ఆదాయం ప్రకారం పేద రాష్ట్రాలు**

తలసరి ఆదాయం ప్రకారం భారతదేశంలో ఉత్తరప్రదేశ్, బీహార్ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలుగా ఉన్నప్పటికీ, జాతీయ సగటులో వరుసగా 43.8% మరియు 39.2% వద్ద అత్యల్ప తలసరి ఆదాయాన్ని కలిగి ఉన్నాయి.

బీహార్: 39.2%ఉత్తరప్రదేశ్: 43.8%, మధ్యప్రదేశ్: 46.1%, రాజస్థాన్: 51.6%, ఛత్తీస్‌గఢ్: 52.3%

ఐదు దక్షిణాది రాష్ట్రాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ మరియు తమిళనాడులు మార్చి 2024 నాటికి భారతదేశ జీడీపీలో 30% వాటాను కలిగి ఉన్నాయి, ఇది 1991లో జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. పశ్చిమ బెంగాల్, ఒకప్పుడు 1960?61లో జీడీపీలో 10.5% వాటాను కలిగి ఉంది, ప్రస్తుతం స్థిరమైన క్షీణత కేవలం 5.6%కి చేరుకుంది. దాని తలసరి ఆదాయం కూడా జాతీయ సగటులో 127.5% నుంచి 83.7%కి పడిపోయింది, ఇది రాజస్థాన్, ఒడిశా వంటి రాష్ట్రాల కంటే తక్కువ. ఉత్తరప్రదేశ్ వాటా 1960?61లో 14% నుంచి 9.5%కి పడిపోయింది. బీహార్ మూడవ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రంగా ఉన్నప్పటికీ 4.3% మాత్రమే అందించింది.

# మోదీతో ఎంకే స్టాలిన్ 45 నిమిషాలు భేటీ

**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని డీఎంకే అధ్యక్షుడు, తమళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారంనాడు ఢిల్లీలో కలుసుకున్నారు. 'సమగ్ర శిక్షా స్కీమ్' కింద కేంద్ర నిధులు విడుదల చేయాలని, 50:50 ఈక్విటీ షేర్ కింద చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేజ్-2కు అనుమతి ఇవ్వాలని ప్రధానిని ఆయన కోరారు. భారత మత్స్యకారులకు సంప్రదాయంగా ఉన్న చేపటవేట హక్కులను పరిరక్షించాలని, సముద్ర జలాల్లో పట్టుకున్న తమిళ మత్స్యకారులు, వారి పడవలను త్వరితగతిని విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఒక విజ్ఞాపన పత్రాన్ని ప్రధానికి స్టాలిన్ అందజేశారు. సుమారు 45 నిమిషాల పాటు ఉభయులూ భేటీ అయ్యారు. ప్రధానితో భేటీ అనంతరం మీడియాతో స్టాలిన్ మాట్లాడుతూ, సహజంగా ఇలాంటి సమావేశాలకు 15 నిమిషాలు సమయం ఇస్తారని, అయితే ఈసారి ఉభయులూ 45 నిమిషాల పాటు మాట్లాడుకున్నామని చెప్పారు. ఒక ముఖ్యమంత్రిగా తాను ఆయనను కలుసుకున్నానని, ప్రధానిగా ఆయన తమ వినతులను ఆలకించారని చెప్పారు. ప్రధానంగా ప్రధానికి మూడు వినతలు చేసినట్టు చెప్పారు. చెన్నై మెట్రోను ఏవిధంగా అయితే కేంద్రం, రాష్ట్రం కలిసి అమలు చేసిందో అదే విధంగా రెండో విడత కూడా అమలు చేయాలని తాము కోరుకుంటున్నామని, అదే విషయాన్ని ప్రధానికి వివరించానని సీఎం చెప్పారు. 2021-22 బడ్జెట్‌లో చెన్నై రైల్ ఫేస్-2 ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారని, 2022లో కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇంతవరకూ, 18,564 కోట్లను పనుల కోసం వెచ్చించామని, అయితే తమిళనాడు కేంద్ర మంత్రి నుంచి అనుమతి పెండింగ్‌లో ఉన్నందున కేంద్రం నుంచి నిధులు తమకు రాలేదని చెప్పారు. దీంతో మెట్రో రైల్ ప్రాజెక్టు నత్తనడక నడుస్తోందని చెప్పారు. ఆ కారణంగా ఎలాంటి జాప్యం లేకుండా నిధులు విడుదల



చేయాలని ప్రధానిని కోరినట్టు చెప్పారు. తమిళ మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రధాని జోక్యం చేసుకోవాలని, సమగ్ర శిక్షా పథకం కింద కేంద్ర నిధులను తమిళ నాడుకు విడుదల చేయాలని కూడా కోరినట్టు తెలిపారు.

## కేరళలో రెండో మంకీ పాక్స్ కేసు నమోదు...




కేరళలో మరో మంకీ పాక్స్ కేసు నమోదైంది. ఇటీవల విదేశాల నుంచి ఎర్నాకులం తిరిగి వచ్చిన వ్యక్తికి ఈ వ్యాధి నిర్ధారణ అయింది. ఈ మేరకు కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. అతడి నమూనాలను పరీక్షలకు పంపించగా పాజిటివ్‌గా తేలిందని తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపింది. కేరళలో ఇది రెండో కేసు. భారత దేశంలో మాత్రం ఇది మూడో కేసు. సెప్టెంబర్ 9న తొలి మంకీ పాక్స్ కేసు నమోదయింది. అంతకుముందు, సెప్టెంబర్ 18న యూఏఈ నుంచి మలప్పురానికి వచ్చిన వ్యక్తికి మంకీ పాక్స్ నిర్ధారణ అయినట్టు ఆరోగ్య శాఖ ధృవీకరించింది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే... 122 దేశాల్లో 99,518 మంకీ పాక్స్ కేసులు నమోదయినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. మంకీ పాక్స్ ఆఫ్రికా దేశాల్లో విస్తృతంగా వ్యాప్తిస్తుండటంతో అక్కడ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించారు.ఈ నేపథ్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మన దేశంలో పలు మార్గదర్శకాలను జారీ చేసింది.

## ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ కొరడా



**చండీగఢ్:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ కొరడా ఝులిపించింది. 13 మంది నాయకులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఆరేళ్ల పాటు పార్టీ నుంచి వారిని బహిష్కరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వచ్చినట్టు ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థులకు పోటీగా ఈ 13 మంది నేతలు ఇండిపెండెంట్లుగా బరిలోకి దిగడంతో కాంగ్రెస్ ఈ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. పార్టీ బహిష్కరణ వేటు పడిన ప్రముఖ నేతల్లో గల్బా ఎస్‌సీ నియోజకవర్గానికి చెందిన నరేష్ ధాండే, జింద్ నుంచి ప్రదీప్ దిల్, పుండ్రి నుంచి సజ్జన్ సింగ్, పానిపట్ రూరల్ నుంచి విజయ్ జైన్ తదితరులు ఉన్నారు. తిరుగుబాటు నేతలను పార్టీ నుంచి బహిష్కరిస్తూ కాంగ్రెస్ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు ఉదయ్ భాను ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల్లో ఐక్యత, క్రమశిక్షణకు పార్టీ కట్టుబడి ఉందనే సంకేతాలిచ్చారు. తొలుత టిక్కెట్ల కేటాయింపుల విషయంలో పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేయడంతో పార్టీ అధిష్టానం వారికి నచ్చచెప్పింది. అయినప్పటికీ కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో అది 13 మంది పార్టీ నేతల బహిష్కరణకు దారితీసింది. పార్టీ అదేశాలతో సీనియర్ నేత, మాజీ మంత్రి సంపత్ సింగ్ నల్వా సీటు నుంచి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. బవానీ ఖెర సెగ్మంట్ నుంచి పోటీని రామ్ కిష్ ఫౌజి విరమించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జస్బీర్ మలౌర్ సైతం పోటీ నుంచి తప్పుకున్నారు. అక్టోబర్ 5న హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, 8న ఫలితాలు వెలువడతాయి.

## తిరుపతి లడ్డూ కల్తీ వివాదం వేళ..
## అయోధ్య రామ మందిరం కీలక నిర్ణయం



భక్తులు మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ కల్తీ వివాదం వేళ అయోధ్య రామ మందిరం నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. బాల రాముడికి బయటి సంస్థలు తయారుచేసిన ప్రసాదాలను నైవేద్యంగా పెట్టడంపై నిషేధం విధించారు. ఆలయ పూజారుల సమక్షంలో తయారుచేసిన ప్రసాదాలనే బాలరాముడికి నైవేద్యంగా పెట్టాలని, భక్తులకు ప్రసాదంగా అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ తెలిపారు. మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ కల్తీ వివాదం దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు ఉపయోగించారన్న ఆరోపణలు పెద్ద దుమారం రేపుతున్నాయి. ఈ లడ్డూ కల్తీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో ఆలయాల్లో పెట్టే ప్రసాదం స్వచ్ఛతపై భక్తుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అయోధ్య ఆలయ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా విక్రయిస్తున్న నెయ్యి స్వచ్ఛతపై రామ మందిరం ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ అనుమానం వ్యక్తం చేశారు. 'దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ ఆలయాలు, మఠాల్లో బయట ఏజెన్సీలు తయారు చేసిన ప్రసాదాలను పూర్తిగా నిషేధించాలి. దేవుళ్లకు ప్రసాదం ఆలయ అర్చకుల పర్యవేక్షణలోనే తయారు చేయాలి. అటువంటి ప్రసాదాన్ని మాత్రమే సమర్పించాలి' అని ఆయన అన్నారు. అదే సమయంలో తిరుపతి బాలాజీ లడ్డూ ప్రసాదంలో కొవ్వు, మాంసాహారం వినియోగిస్తున్నారనే ఆరోపణలపై దేశవ్యాప్తంగా వివాదాలు తీవ్రమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా భక్తులు, సాధుసన్యాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మార్కెట్లో అమ్ముతున్న నూనె, నెయ్యిల నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేయించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## ఛఠ్ పూజ, దీపావళి నేపథ్యంలో రైల్వే కోచ్‌లు పెంపు

రైలు ప్రయాణికులకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుభవార్త చెప్పారు. ఛఠ్ పూజ దీపావళి నేపథ్యంలో రైల్వే కోచ్‌ల సంఖ్యను పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 12,500 కోచ్‌లు అదనంగా జత చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. 'ఈ పండుగ సీజన్‌లో 108 రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్యను పెంచాం. ఛఠ్ పూజ, దీపావళి ప్రత్యేక రైళ్లకు 12,500 కోచ్‌లు అదనంగా జత చేశాం. 2024-25లో పండగ వేళల్లో ఇప్పటి వరకూ మొత్తం 5,975 రైళ్లను నడపనున్నట్లు ప్రకటించాం. ఈ నిర్ణయం దాదాపు కోటి మందికిపైగా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఈజీగా తమ గమ్యస్థానాలను కోరుకొనేందుకు సాయపడుతుంది. 2023-24లో పండుగల సీజన్‌లో 4,429 ప్రత్యేక రైళ్లను నడిపించాం' అని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కాగా, దసరా, దీపావళి, ఛట్ పూజ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ ఇప్పటికే ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 5 నుంచి నవంబర్ 12 వరకు ప్రయాణికులకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. కాగా, ఏటా ప్రత్యేక సందర్భాల్లో రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను ప్రయాణికులకు అందుబాటులో ఉంచుతుందన్న విషయం తెలిసిందే. దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పెద్ద పెద్ద పండగల దృష్ట్యా ఆయా మార్గాల్లో రైళ్లను నడుపుతుంటుంది. ఇక ఛఠ్ పూజ సమయంలోనూ రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతుంది. ఉత్తర భారతీయులు ఛఠ్ పూజను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకుంటారు.

# కేసీఆర్ పాలనలో తెలంగాణకు చేసింది శూన్యం

**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అనవసరపు విమర్శలు చేస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మూసీ ప్రజలకు 10వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మాజీ మంత్రి కేటీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రకటించారని గుర్తుచేశారు. ఇవాళ(శుక్రవారం) తెలంగాణ సెక్రటేరియట్ మీడియా పాయింట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ... అధికారంలో ఉంటే ఒకలా.. అధికారం కోల్పోతే మరోలా తాము మాట్లాడమని మంత్రి పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు. మూసీ రివర్ బెడ్ నివాసాల సర్వే జరుగుతుందని.. అక్రమ కట్టడాలు అయినా.. ఇళ్లను కోల్పోయిన వారికి పునరావాసం కల్పిస్తామని చెప్పారు. ఎన్నికలకు ముందు రింగ్ రోడ్డును రూ. 7వేల కోట్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం అమ్ముకుంది అని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి నీళ్లు ఒక్క టీఎంసీ అయినా తెచ్చారా? అని



మంత్రి పొన్నం ప్రభాకర్ నిలదీశారు. 2014 వరకు 25 %బ్యూ%లు ఉన్నాయన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణకు చేసింది ఏంటంటే శూన్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎలాంటి ఆటంకం కలిగించలేదని అన్నారు. గతంలో హైదరాబాద్‌లో భారీ వర్షాలు వస్తే రూ. 10వేలు బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే పంచి చేతులు దులుపుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు.


సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేస్తే చర్యలు..

"ప్రజలపై మాజీ మంత్రి కేటీఆర్‌కు ప్రేమ ఉంటే నన్ను కలిసి మీ అభిప్రాయం పంచుకోండి. రాబోయే రోజుల్లో రూ. 5500 కోట్లతో మూసీకి గోదావరి నీరు తెచ్చే ఆలోచన చేస్తున్నాం. ఒళ్లు, నాలుక దగ్గర పెట్టుకుని వాస్తవ విమర్శ చేయాలి. లేదంటే పర్యవసానం తప్పదు. బీజేపీ - బీఆర్ఎస్ పార్టీలు తాన అంటే తందాన అని అంటున్నాయి. సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. హైదరాబాద్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా బీజేపీ - బీఆర్ఎస్ పార్టీల నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు" అని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బీసీల గణన తర్వాతే స్థానిక సంస్థలు ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి

ఉంటుందని అన్నారు మహేష్‌గౌడ్. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే కొన్ని అమలు చేసింది. కీలకమైన కులగణనకు సంబంధించిన గైడ్‌లైన్ మూడు నాలుగు రోజుల్లో రానున్నాయని తెలిపారు. అవి పూర్తి అయిన తర్వాత బీసీలకు రావాల్సిన రిజర్వేషన్ల అంశాన్ని తేలుస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారని కూడా చెప్పేశారు. త్వరలోనే బీసీ సంఘాలను సీఎం వద్దకు తీసుకెళ్తానని మహేష్ మాట ఇచ్చారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి కావాల్సిన డిమాండ్లు, అన్నీ కూడా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్దామన్నారు. అంతే కాకుండా కుల గణన పూర్తైన తర్వాత నిజాం గ్రౌండ్స్‌లో సభ పెట్టి సీఎం రేవంత్‌ను సన్మానిద్దామని పిలుపునిచ్చారు. పార్టీ పదవుల్లో, ప్రభుత్వం పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి తీవ్రంగా శ్రమిస్తున్నారని అన్నారు. కర్ణాటకలో, బిహార్‌లో అధికారంలో ఉన్నప్పుడు కుల గణన చేసి చూపించామన్నారు. ఇప్పుడు తెలంగాణలో కూడా చేసి చూపిస్తామని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్‌లు, ఇతర సమస్యలపై ఓవైపు నుంచి కృష్ణయ్య పోరాటానికి సిద్ధమవుతున్నారు. అదే టైంలో బీఆర్ఎస్ కూడా ఒత్తిడి తీసుకొస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తోంది. బీసీ సమస్యలు పరిష్కరించి కృష్ణయ్య లాంటి వ్యక్తిని పార్టీలోకి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్



ప్రయత్నిస్తోంది. బీసీలు తమవైపే ఉండేలా ప్లాన్ చేస్తోంది. అందుకే ఆయన వద్దకు రాయబారం కూడా పంపించారు. రెండు రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేసిన కృష్ణయ్యతో మల్లు రవి సమావేశమయ్యారు. పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఇటు బీఆర్ఎస్‌కి కూడా అవకాశం ఇవ్వండా ఉండేలా ప్లాన్ చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల లోపు కుల గణన పూర్తి చేసి సంపూర్ణ ఆధిపత్యం సాధించాలని కాంగ్రెస్ పార్టీ చూస్తోంది. అందుకు తగ్గట్టుగానే వచ్చే వారంలో కులగణనకు సంబంధించిన కీలక ప్రకటన చేయనుంది.

# ఆదివారం మూసీలో కూల్చివేతలు

**వరంగల్ :** హైదరాబాద్ నగరంలో మూసీ నది ప్రక్షాళన దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. తాజాగా.. మూసీ రివర్ బెడ్ ఏరియాలో ఉన్న నిర్మాణాలను అధికారులు సర్వే చేసి పరిశీలించారు. పాతబస్తీలోని ఛాదర్ ఘాట్, మూసానగర్, శంకర్ నగర్ ఏరియాల్లో కూల్చివేసే నిర్మాణాలకు మార్క్ చేశారు. దీంతో అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. గొల్కొండ ఏరియాలోని మూసీ నది పరివాహక ప్రాంతాల్లోనూ అధికారులు సర్వే నిర్వహించారు. కూల్చాల్సిన నిర్మాణాలను గుర్తించి.. మార్క్ చేశారు. మొత్తం 25 బృందాలు సర్వేలో పాల్గొన్నాయి. అతి త్వరలోనే మార్క్ చేసిన నిర్మాణాలను కూల్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే.. అక్కడ నివాసం ఉంటున్న ప్రజలను ఒప్పించి.. వారికి వేరేచోట డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చి ఖాళీ చేయించాలని అధికారులు ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. మూసీ నది వెంబడి రెవెన్యూ శాఖ నిర్వహించిన తాజా సర్వేలో.. నదీ గర్భంలో 2,116 నిర్మాణాలు, బఫర్ జోన్‌లో మరో 7,850 నిర్మాణాలు ఉన్నట్లు తేలిందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మూసీ రివర్ ఫ్రంట్ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లలో పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేస్తున్నారు. నది ఒడ్డున ఉన్న నివాసాల నుండి ఖాళీ చేసే ప్రజలకు వసతి కల్పించడానికి ప్రభుత్వం నగరంలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు 16,000 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించిందని ఆఫీసర్లు చెబుతున్నారు. మొదటి దశలో మూసీ నదీగర్భంలో ఉన్న 1,600 ఆక్రమిత ఇళ్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అక్కడి నివాసితులను తరలించనున్నారు. బఫర్ జోన్‌లో నివసిస్తున్న వారికి న్యాయమైన పరిహారం, భూసేకరణ, పునరావాసం, పునరావాస చట్టం 2013లో పారదర్శకత హక్కుకు అనుగుణంగా వారి నిర్మాణాలకు పరిహారం అందుతుంది. డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్



ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అధికారులు.. అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు బుల్డోజర్లను రివర్ ఫ్రంట్ ప్రాంతానికి తరలించడం ప్రారంభించారు. శనివారం సాయంత్రానికి అంతా సిద్ధం చేసి.. ఆదివారం కూల్చివేతలు చేపట్టే అవకాశం ఉంది. ఏకకాలంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల రెవెన్యూ శాఖకు చెందిన బృందాలు.. మూసీ నది వెంబడి నిర్మాణాలను సర్వే చేయడం ప్రారంభించి.. అక్రమ కట్టడాల్లో నివాసముంటున్న ప్రజలను ఇంటింటికీ సర్వే చేసి ఖాళీ చేయించేలా చర్చలు జరిపారు. రివర్ ఫ్రంట్‌లోని ప్రజలను.. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తరలించిన తర్వాతే కూల్చివేత ప్రక్రియ ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. బఫర్ జోన్‌లోని ప్రజల పునరావాసం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని.. స్పష్టమైన హక్కు పత్రాలు ఉన్న వారికి 2013 చట్టం ప్రకారం తగిన పరిహారం చెల్లిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రదలు ఎక్కువగా వచ్చినప్పుడు జంట జలశయాలు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ గేట్లు ఓపెన్ చేసినప్పుడు కొంతమందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తుంటారు. చాదర్ ఘాట్ ప్రాంతంలో ఉండే శంకర్ నగర్, మూసారం బాగ్ లోని కొన్ని బస్తీల్లో చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇళ్లలోకి నీరు చేరుతున్న పరిస్థితి ఉంది. అయితే, మూసీ నుంచి 50 మీటర్ల వరకు బఫర్ జోన్ ఉంటుంది. బఫర్ జోన్, రివర్ బెడ్ లోనూ ఉండే ఇళ్లు అన్నింటినీ తొలగించనున్నారు. ఆ తర్వాత మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ ను చేపట్టనున్నారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో వరదలు ముంచెత్తినా.. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవడంలో భాగంగా.. ఈ పనులు చేస్తున్నట్లు రేవంత్ సర్కార్ తెలిపింది.

# ఆ హామీ నెరవేర్చే వరకు రేవంత్ రెడ్డిని నిద్రపోనీయను : హరీశ్ రావు

**రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి**

**ఈ వానాకాలం ఆయన చెప్పిన రూ.7,500 లేవు**

**గతంలో ఇచ్చిన రూ.5 వేలు లేవు**

**రైతుబంధు కేసీఆర్ హయంలో నాట్లకు రైతుబంధు అందిస్తే, ఈ ప్రభుత్వం పంట కోతకు వచ్చినా రైతుబంధు ఇవ్వలేదు**

**కాంగ్రెస్ సర్కారు దొంగరాత్రి కరెంట్ ఇస్తుంది**

**మాజీ మంత్రి హరీశ్ రావు**

నంగునూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేపట్టారు. రూ.2 లక్షల రుణమాఫీతోపాటు రైతులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. ధర్నాలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ జరిగే వరకు నేను నిద్రపోను, రేవంత్ రెడ్డిని నిద్రపోనీయను అన్నారు. రైతుబంధు కేసీఆర్ హయంలో నాట్లకు రైతుబంధు అందిస్తే, ఈ ప్రభుత్వం పంట కోతకు వచ్చినా రైతుబంధు ఇవ్వలేదని మాజీ మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు దొంగరాత్రి కరెంట్ ఇస్తుందని, కానీ కేసీఆర్ కడుపు నిండా 24 గంటల కరెంట్ ఇచ్చిండని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు వచ్చిన 24 గంటల కరెంటు.. ఇప్పుడెందుకు వస్తలేదని ఆయన ప్రశ్నించారు. కరోనా సమయంలోనూ రైతు బంధుకు సమయం ఇచ్చినమన్నారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని, ఈ వానాకాలం ఆయన చెప్పిన రూ.7,500 లేవని, గతంలో ఇచ్చిన రూ.5 వేలు లేవని మండిపడ్డారు. రైతు బంధు ఇవ్వకుండా రైతులను అప్పులపాలు చేస్తున్నారని విమర్శించారు. కుంటిసాకులు, అబద్దాలతో కాలం గడుపుతున్నారని అన్నారు. కేసీఆర్ 11 సార్లు సమయానికి రైతు బంధు ఇచ్చిండని, వడ్లు కొంటే మూడు రోజుల్లో పైసలు వేసిండని చెప్పారు. కేసీఆర్ రైతు విలువ, రైతు భూమి విలువ పెంచిండని, కానీ కాంగ్రెస్ వచ్చినంక రైతు విలువ తగ్గిందని, భూమి విలువ తగ్గిందని హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం కూలిపోయిందంటున్న రేవంత్ రెడ్డి వచ్చి రంగనాయకసాగర్, మాల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ చూడాలని సూచించారు. కాళేశ్వరంలో వంద బాగాలు ఉంటాయని, అందులోని ఒక్క భాగంలో రెండు పిల్లర్లు కుంగితే మొత్తం పోయిందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ వచ్చి కాళేశ్వరం కట్టినంక రైతులు రెండు పంటలు పండిస్తున్నరని చెప్పారు. రెండు లక్షల మాఫీ, వడ్లకు బోనస్ అన్నారని, వచ్చిందా అని మాజీ మంత్రి ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకు బోనస్ అని, ఇప్పుడు సన్నాలు అంటున్నారని మండిపడ్డారు.

## నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము...



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు (సెప్టెంబరు 28) హైదరాబాద్ రానున్నారు. నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రపతి రాక నేపథ్యంలో నేడు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఈ మేరకు అదనపు సీపీ (ట్రాఫిక్) విశ్వప్రసాద్ వెల్లడించారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి బేగంపేట, హెచ్‌పీఎస్, పీఎన్‌టీ జంక్షన్, రసూల్‌పురా, సీటీవో ప్లాజా, టివోలీ, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, బొల్లారం రాష్ట్రపతి నిలయం ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని తెలిపారు. నిన్న బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక, అటవీ, విద్యుత్, తదితర శాఖల ఏర్పాట్లపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష నిర్వహించారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రతా ఏర్పాట్లు, బందోబస్తును పర్యవేక్షించాలన్నారు. అనంతరం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన 8 రాష్ట్రాలకు సంబంధించిన స్టాళ్లను, 4 ఫుడ్ కోర్టులను, మీడియా సెంటర్‌ను, ఇతర స్టాల్స్‌ను పరిశీలించారు.

## పురాతన మెట్ల బావులకు మహర్దశ..

-మొదటిపేజీ తరువాయి

ఇకపై పురాతన బావులను ప్రక్షాళన చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు వారు చర్యలు చేపట్టనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి వారికి ఒప్పంద పత్రాలు అందజేశారు.

**పునరుద్ధరించే బావులు ఇవే..**

ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్ధరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. మంచిరేవుల మెట్ల బావిని సాయి లైఫ్ సంస్థ దత్తత తీసుకుంది. సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్ధరించడానికి భారత్ బయోటెక్ ముందుకొచ్చింది. అలాగే అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్‌నుమా మెట్ల బావిని టీజీ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీలు దత్తత తీసుకున్నాయి. పురాతన మెట్ల బావులకు పూర్వం వైభవం తీసుకువచ్చి, పర్యాటకులు వచ్చే విధంగా వాటిని తయారు చేయనున్నారు.

**చారిత్రక కట్టడాలు రక్షిస్తాం..**

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.." మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం. హైదరాబాద్ సంస్కృతి ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నాం. త్వరలోనే అందులో శాసన మండలి ఏర్పాటు చేస్తాం. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్నీ పరిరక్షిస్తాం. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తాం. హైదరాబాద్ సిటీ కాలేజ్, పురానాపూల్ బ్రిడ్జి, హైకోర్టు భవనం, జూబ్లిహాల్ వంటి చారిత్రక కట్టడాలను రక్షించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోంది" అని తెలిపారు

## 500 కోట్ల పెరుగుదలపై విజిలెన్స్ గురి

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు విజిలెన్స్ ఎంక్వైరీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కొన్ని విషయాలను బయటపెట్టింది. అవినీతిని ఎంత అందంగా చేయాలో గత ప్రభుత్వాన్ని చూస్తే తెలుస్తుందని పేర్కొంది. సచివాలయం నిర్మాణం రూ.617 కోట్ల అంచనా వేసి మొదలుపెట్టింది గత కేసీఆర్ సర్కార్. నిర్మాణం పూర్తి అయ్యేనాటికి దాన్ని అమాంతంగా పెంచేసింది. రూ.617 కోట్ల నుంచి 1,140 కోట్ల రూపాయల వరకు అంచనాలు పెంచి ఖర్చు చేసినట్టు ప్రస్తావించింది. సెక్రటేరియేట్‌లో ఐటీ పరికరాల కొనుగోళ్ల కోసం తొలుత 181 కోట్ల రూపాయలు అంచనా వేసి దాన్ని 361 కోట్లకు పెంచినట్టు పేర్కొంది. అటు సచివాలయం నిర్మాణం కోసం అంచనాల కంటే ?523 కోట్లు, ఐటీ పరికరాల కొనుగోలుకు అంచనాల కంటే ?180 కోట్ల రూపాయల అధిక ఖర్చు చేసిందని ప్రస్తావించింది. ఈ భాగోతంపై విజిలెన్స్ నిగ్గు తేల్చనుంది.

అవినీతి ఎన్ని రకాలుగా అవినీతి చేయవచ్చో ఆ పార్టీకి తెలుసని తెలిపింది. వారి అవినీతి అనుభవంతో అసంబద్ధ ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై బురద జల్లుతూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించింది. బీఆర్ఎస్ అవినీతిని కప్పి పుచ్చుకునేందుకు ప్రజా ప్రభుత్వంపై అసంబద్ధ విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని దుయ్యబట్టింది. మరి విజిలెన్స్ విచారణలో ఇంకెన్ని విషయాలు బయటపడతాయో చూడాలి.

## బీఆర్ఎస్‌లో ఏం జరుగుతోంది..?

**కరీంనగర్ :** అధికారం కోల్పోయిన తర్వాత ప్రజలతో పనేం ఉన్నాదన్నట్లు ప్రధానమైన నేతలు అంతా సైలెంట్ అయిపోయారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు తప్పించి మిగిలిన నేతలు భూతద్దం పెట్టి వెదికినా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదట.. అధినేత కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ నేతలు బయటకి ఎందుకు రావడం లేదు. తెలంగాణలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ నేతలకు ఏ పనిలేకుండా పోయిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాన్ని అనుక్షణం కనిపెడుతూ ప్రజలకు రక్షణగా నిలవాల్సిన బీఆర్ఎస్ నేతలు ఆ పనిచేయడం లేదన్న విమర్శలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. అధికారం గల్లంతై 9 నెలలు అవుతున్నా? నూటికి 90 శాతం మంది బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో కనిపించడం లేదనే వ్యాఖ్యలే వినిపిస్తున్నాయి. ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్‌రావు పర్యటనల్లో హడావుడి చేస్తున్న నేతలు ఆ తర్వాత క్యాడర్‌కు అందుబాటులో ఉండటం లేదని చెబుతున్నారు. ముఖ్యంగా పార్టీని నడిపే విషయంలో హైకమాండ్ నుంచి ఎలాంటి దిశానిర్దేశం లేకపోవడంతోనే బీఆర్ఎస్ నేతలు ఇలా ఇళ్లకే పరిమితమవుతున్నారనే టాక్ కూడా వినిపిస్తోంది?. బీఆర్ఎస్? టీఆర్ఎస్‌గా ఉన్న సమయం నుంచి నేతలకు చేతినిండా పనిఉండేది. అధినేత కేసీఆర్ పార్టీ స్థాపించిన సమయంలో ఉద్యమించి రాష్ట్రం మొత్తం కదం తొక్కిన గులాబీ శ్రేణులు? 2014లో తొలిసారి అధికారంలోకి వచ్చిన నుంచి 2018 వరకు దాదాపు పదేళ్లు బిజీబిజీగా ఉండేవారు. అధినేత కేసీఆర్ కూడా నేతలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో జిల్లాల్లో నిత్యం బీఆర్ఎస్ నేతల హడావుడి కనిపించేది. కానీ, అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌లో మునుపటి పోరాట పటిమ కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణలో హైకమాండ్‌కే స్పష్టమైన విధానం లేకపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రతిపక్ష స్థానంలో బీఆర్ఎస్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం లేదన్న విమర్శలు పార్లమెంట్ ఎన్నికల ముందు నుంచీ వినిపిస్తున్నాయి. ప్రధానంగా అధినేత కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమైపోవడం? సీనియర్ నేతలు ఎవరూ పార్టీ కార్యాలయం వైపు చూడటం కూడా మానేశారంటున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడే విషయంలో ఇంకో విపక్షం బీజేపీ నుంచి బీఆర్ఎస్ గట్టి సవాలే ఎదుర్కొంటోందని చెబుతున్నారప్రస్తుతం హైదరాబాద్‌లో హీట్ పుట్టిస్తున్న హైడ్రా విషయంలో బీఆర్ఎస్ వెనకబడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో కేటీఆర్, హరీశ్ రావు తప్ప మిగిలిన నేతలు ఎవరూ మాట్లాడటం లేదని అంటున్నారు. ఇక రైతు రుణమాఫీ, గ్యారెంటీల అమలు విషయంలోనూ కేటీఆర్, హరీశ్ రావు తప్ప మిగిలిన బీఆర్ఎస్ నేతలు మాటలు ఎక్కడా వినిపించడం లేదంటున్నారు. దీనివల్ల పార్టీ క్యాడర్‌లో అయోమయం కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో ఓటమిపై చాలా నియోజకవర్గాల్లో ఇంతవరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదంటే బీఆర్ఎస్ పరిస్థితి ఏ విధంగా తయారైందో అర్థం చేసుకోవచ్చంటున్నారు పరిశీలకులు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా.. పోరాడితే పార్లమెంట్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు వచ్చేవని.. కానీ, అప్పుడు అస్త్రసన్యాసం చేసినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరించడం వల్ల చరిత్రలో లేనటువంటి ఓటమిని ఎదుర్కోవాల్సివచ్చిందని చెప్పుకుంటున్నారు. ఇక ఇప్పుడైనా తేరుకుని కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందాలంటే ఏం చేయాలనే అంశమై పార్టీలో చర్చ జరగాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# ఎనుముల రేవంత్ రెడ్డి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డి!

**రుణమాఫీ విషయంలో ప్రభుత్వానికి డెడ్ లైన్..?**
**దసరాలోపు రైతులందరికీ రుణమాఫీ చేయాలిదంటే**
**రైతులందరితో కలిసి సచివాలయం ముట్టడిస్తాం..**
**ఎమ్మెల్యే హరీష్ రావు**



**సిద్ధిపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో రైతులు నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు. ఏదో సామెత అన్నట్టు పాలేవో నీళ్ళేవో తేలాలంటే కొద్దిగా టైం పడుతది.కెసిఆర్ ఉన్నప్పుడు రైతులు ఏ విధంగా ఉండే కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉంది అనేది అందరికీ అర్థమైంది.కెసిఆర్ ముఖ్యమంత్రి కాకముందు రైతుల పరిస్థితి ఎలా ఉండే. రైతులకు ఎరువు బస్తా కావాలంటే పొద్దున ఐదు గంటలకు చెప్పు లైన్లో పెడితే ఒక్క ఎరువు బస్తా దొరికేది.రైతులను ఎరువు బస్తాల కోసం లైన్ల నిలబెట్టింది కాంగ్రెస్.కెసిఆర్ ప్రతి ఊరికి ఎరువులను లారీల్లో పంపి రైతులకు అందించారు.కెసిఆర్ రాకముందు కాలిపోయే మోటర్లు పేలిపోయే ట్రాన్స్ఫార్మర్లు.కెసిఆర్ వచ్చినంక 24 గంటల కరెంటు ఇచ్చిండు. ట్రాన్స్ఫార్మర్లు కాలకుండా కడుపునిండా రైతులకు కరెంటు ఇచ్చిండు.కాంగ్రెస్ పాలనలో దొంగ రాత్రి కరెంట్ వచ్చేది. కెసిఆర్ 24 గంటలు కరెంట్ అందించాడు

మళ్ళీ కాంగ్రెస్ పాలనలో కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్ఫార్మర్లు.కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి ఏదో మీటింగ్ లో అంటున్నారు కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటలు కరెంటు ఎట్లా వచ్చింది ఇప్పుడు ఎందుకు వస్తలేదని కరెంట్ అధికారులను అడుగుతుంది.

కేసీఆర్ ఉండంగా ఫార్మరే ఫస్టు. కరోనా వచ్చినప్పుడు 45 రోజులు లాక్ డౌన్ ఉంటే గవర్నమెంట్ కి రూపాయి ఆదాయం లేదు. ఐనా కేసీఆర్ రేషన్ కార్డు మీద 1500 రూపాయలు ఇచ్చిండు. బియ్యం పంపిండు అందర్నీ ఆదుకున్నాడు.కరోనా వచ్చినప్పుడు కూడా రైతులకు రైతుబంధు వేసిన ముఖ్యమంత్రి కేసీఆర్.గవర్నమెంట్ కి ఆమదానం లేకపోయినా ఎమ్మెల్యేల, మంత్రుల జీతాలు బంద్ పెట్టిండు కానీ రైతులకు మాత్రం రైతుబంధు ఇచ్చిండు.అది కేసీఆర్కు రైతు మీదున్న ప్రేమ. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమైంది? కరోనా లేదు అయినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వడం లేదు.కెసిఆర్ ఉండగా నాట్లు పడే వరకు రైతుల ఫోన్లలో టింగు టింగ్ అని రైతుబంధు పడేది.ఇప్పుడు నాట్లు అయి, కలుపై, పంటకు మందు కొట్టుడు కూడా అయిపోయింది. పంట కోతకు ఉన్నా, దసరా పండుగ దగ్గరకు వస్తున్నా ఇంకా రైతుబంధు పడలేదు.మాటలు మాత్రం కోటలు దాటుతాయి. అన్ని వంకర మాటలే కానీ రైతులకు మాత్రం రైతుబంధు వేస్తలేదు రేవంత్ రెడ్డి.రైతుబంధుకు కెసిఆర్ ఉండంగా ఎకరానికి 4000 ఇచ్చిండు. మల్ల గెలిస్తే 5000 ఇస్తానని ఇచ్చిండు. మళ్లీ గెలిస్తే 8000 చేస్తా అన్నాడు గెలిస్తే చేస్తుండే.గ్రెస్ గెలిచి 7,500 రైతుబంధు ఇస్తా అన్నారు. పోయిన యాసంగికి 5000 ఇచ్చింద్రు. ఈ పంటకు మొత్తానికి ఎగబెట్టారు.రైతులను అప్పుల పాలు చేస్తున్నడు రేవంత్ రెడ్డి. పంట పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేసే పరిస్థితి ఏర్పడింది.అబద్దాలు చెప్పి కుంటి సాకులు చెప్పి ఇప్పటిదాకా రైతులకు రైతుబంధు పైసలు ఇవ్వలేదు.రాష్ట్రంలో రైతులను ఆగం చేయడం కాదా? కెసిఆర్ ఒక్క సారి కాదు 11 సార్లు రైతుబంధు ఇచ్చిండు. ఊరు ఊరుకి కొనుగోలు కేంద్రాలు పెట్టి టైం కు వడ్లు కొనుడు అయినా, వడ్లను కొన్న పైసలు కూడా మూడు రోజులనే రైతులకు అందించిండు కేసీఆర్.కేసీఆర్ వచ్చినంకనే రైతుల భూముల విలువలు పెరిగినాయి.కెసిఆర్ రాకముందు ఎకరం 5 లక్షలు కూడా పోకపోయేది. కేసీఆర్ వచ్చినంక 24 గంటలు కరెంటు ఇచ్చి చెరువులు మంచిగా చేసి రిజర్వాయర్లు కట్టి రెండు పంటలు నీళ్లు ఇచ్చి రైతు విలువ పెంచిండు. రైతు విలువతో పాటు రైతు భూమి విలువ కూడా పెరిగింది. కాంగ్రెస్ వచ్చింది రైతు విలువ తగ్గించింది.రైతుబంధు ఎగపెట్టిండు, 4000 పెన్షన్ ఎగపెట్టిండు, అక్కచెల్లెళ్లకు 2500 ఎగపెట్టిండు, వడ్లకు బోనస్ ఎగపెట్టిండు, ఉద్యోగస్తులకు డిఏ లు ఎగపెట్టిండు, తులం బంగారం ఎగపెట్టిండు. అందుకే నువ్వు ఎనుముల రేవంత్ రెడ్డి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డివి.ఇప్పటికైనా రైతులని, ప్రజలను మోసం చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుమని నేను డిమాండ్ చేస్తున్నాను. మీరిచ్చిన హామీలను నెరవేర్చేదాక బీఆర్ఎస్ పార్టీ విడిచి పెట్టదు. దసరాలోపు రైతులందరికీ రుణమాఫీ చేయాలి. లేదంటే రైతులందరితో కలిసి సచివాలయం ముట్టడిస్తాం.

# జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో ప్రవాసి ప్రజావాణి...గల్ఫ్ కార్మికులు

**ఎన్నారై ల కోసం ప్రత్యేక కౌంటర్ ప్రారంభం..**
**మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్ :** రిబ్బన్ కట్ చేసి ప్రవాసి ప్రజావాణి ప్రత్యేక కౌంటర్ ను హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి , ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పిసిసి ఎన్నారై సెల్ చైర్మన్ వినోద్, ప్రజావాణి నోడల్ ఆఫీసర్లు, ఇతర ఎన్నారై విభాగం నేతలు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా గల్ఫ్ కార్మికులు సమస్యలపై పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల్లో చెప్పినట్టు 4 అంశాల పై నిర్ణయం తీసుకోవడం జరిగింది. అందులో మొదటిది తెలంగాణ ప్రభుత్వం పక్షాన ప్రజా భవన్ లో ప్రవాసి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. ష్ట్రం నుండి గల్ఫ్ దేశాలకు పెద్ద ఎత్తున ఉపాధి నిమిత్తం వెళ్ళారు. వారి సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. గల్ఫ్ ప్రమాదంలో చనిపోయిన వారికి 5 లక్షల ఎక్స్ గ్రేషియ ఇవ్వడానికి ఇప్పటికే జీవో జారీ చేసుకున్నాం. గల్ఫ్ కార్మికుల కుటుంబాల పిల్లల చదువులకు ఇబ్బందులు లేకుండా గురుకులాల్లో సీట్లు కల్పిస్తున్నాం. గల్ఫ్ కార్మికుల కోసం ఉత్తర తెలంగాణ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలతో అడ్వైజరి కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. నా నియోజకవర్గం లో జాబ్ మేళా పెడితే 9 వేల మంది వచ్చారు. విదేశాల్లో ఉపాధి అవకాశాల కోసం పోయేవరికి అక్కడి చట్టాలు తెలియడం లేదు. వారికి ఇక్కడి కంపెనీలపై అవగాహన కల్పించాలి. వాటిపై విస్తృత సమాచారం అందించాలి. సంస్థను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలి. ప్రజలను మోసం చేస్తూ విదేశాలకు పంపించి అక్కడ ఇబ్బందులు పడేలా చేస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ సంస్థలు ఉన్నాయి అక్కడ శిక్షణ పొంది విదేశాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో ఈ ప్రజావాణి తీసుకురావడానికి కృషి చేసిన అందరికీ ధన్యవాదాలని అన్నారు.

# డాక్యుమెంట్ రైటర్లతో సబ్ రిజిస్ట్రార్ల కుమ్మక్కు

**వరంగల్ :** గింజోటి నాటితే మొక్కోటి మొలుస్తదా" అన్న చందంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రర్ల పరిస్థితి తయారయిందని జిల్లా ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు... ఇక్కడి వాళ్ళ అక్కడికి అక్కడి వాళ్ళు ఇక్కడికి మారినంత మాత్రాన అవినీతి పనులు జరగకుండా పోతాయా అన్న అపోహలను నిజం చేస్తూ సబ్ రిజిస్ట్రర్ల వ్యవహారం కొనసాగుతుందని ప్రజలు వింతగా చర్చించుకుంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో పారదర్శకమైన విధంగా ప్రజలకు సేవలు అందించాలన్న ఉద్దేశంతో చేపట్టిన బదిలీల ప్రక్రియ క్షేత్రస్థాయిలో అబాసు పాలవుతుందన్న విమర్శలు జిల్లాలో జోరుగా వినిపిస్తున్నాయి. జూలై చివరి వారంలో తెలంగాణ వ్యాప్తంగా స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల ప్రక్రియ జరిగింది.అ బదిలిల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాలో పనిచేసిన సబ్ రిజిస్ట్రర్లను ప్రభుత్వం ఖమ్మం తోపాటు ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. అక్కడివారిని వరంగల్ ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు బదిలీపై తెచ్చిన ఫలితం ఏమీ లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇతర జిల్లాల నుండి వచ్చి వరంగల్ జిల్లాలో సబ్ రిజిస్టర్ గా పనిచేస్తున్న అధికారులు డాక్యుమెంట్ రైటర్లతో కుమ్మక్కై పనిచేస్తున్నట్లు సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. నేరుగా సబ్ రిజిస్టర్లు డాక్యుమెంట్ రైటర్ ను పిలిపించి తనకు వేళల్లో మామూలు ఇచ్చి వందల్లో తీసుకోవాలని చర్చించడం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. సబ్ రిజిస్టర్ వ్యవహారంతో ఇటు కార్యాలయ సిబ్బంది డాక్యుమెంట్ రైటర్లు ఏం చేయాలో పరిస్థితులు ఉన్నాయని తలలు పట్టుకుంటున్నారు.ఇతర జిల్లాల నుండి వరంగల్ జిల్లాలో విధులను నిర్వహిస్తున్నామన్న జ్యాసే లేకుండా సబ్ రిజిస్టర్లు అవినీతి పనులకు తెగబడుటంతో ప్రజలు విస్తుపోతున్న పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు .కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారి పట్ల సబ్ రిజిస్టర్లు చిన్న చిన్న కారణాలు చూసి వేలల్లో మామూళు డిమాండ్ చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. సబ్ రిజిస్టర్లు అవినీతికి తెగబడటంతో వాటికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని వివిధ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈ తతంగం జరుగుతున్న స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు చోద్యంగా వ్యవహరించడంపై ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతుంది.కార్యాలయంలో జరుగుతున్న అవినీతి పనులపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకోన్నట్లయితే వారు చేసే పనుల్లో ఉన్నతాధికారులకు వాటా ఉంటుందన్న అపోహలు నిజం కావచ్చునన్న అనుమానాలకు బలం చేకూరినట్టు అవుతుందని ప్రజలు అనుకుంటున్నారు.




# స్వరాష్ట్ర సాధనలో అలుపెరగని కృషి చేసిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

**రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్**
**కమిషనరేట్ లో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు**

**మంథని :** కొండా లక్ష్మణ్ బాపూజీ మహనీయుడని, మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేశారని, స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ అన్నారు.స్వాతంత్ర సమరయో ధుడు, తొలి మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సిపి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ కొమరంభీం జిల్లా, వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న ఆయన జన్మించారని,1952 ఎన్నికల్లో తొలిసారి ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొండా లక్ష్మణ, తర్వాత 1967,1972లో భువనగిరి నుంచి అసెంబ్లీకి ప్రాతినిథ్యం వహించారన్నారు. 1957–60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్‌గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినేట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. 1969 తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక భూమిక పోషించి తెలంగాణ కోసం ఉద్యమించి, ఉద్యమకారులతో ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష, ఢిల్లీలో జంతర్‌మంతర్‌లో సత్యాగ్రహం చేయడం ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనం అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఇవ్వకపోతే సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారని వారి జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం అన్నారు . ఈకార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్ లు రవీందర్, అజయ్ బాబు, ఆర్ఐ దామోదర్, మల్లేశం, శ్రీనివాస్, వామన మూర్తి, సంపత్, సూపరిండెంట్ ఇంద్ర సేనా రెడ్డి , మనోజ్ కుమార్ , సంధ్య , సీపీఓ సిబ్బంది, వివిధ వింగ్స్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## త్రాగు నీటి కోసం రోడ్ ఎక్కిన గ్రామస్తులు



**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండల కేంద్రములోని ఎక్లాపూర్ క్యాంపులో గ్రామస్తులు త్రాగునీరు రావడం లేదని ఖాళీ బిద్యాలతో గ్రామస్తులు రోడ్డు పైకి వచ్చి నిరసన చేయడం జరిగింది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మిషన్ భగీరథ పైపులైన్లు వేసి నల్లలు పిట్టింగ్ చేసిన ఒక్క చుక్క నిరు రావడం లేదని ఊరిలో రెండు వాటర్ ట్యాంకు లు ఉన్న కూడా ప్రయోజనం లేకుండా పోతుందని, త్రాగు నీటి కోసం పంటపొలాలు బోర్ల దగ్గర నుండి తీసుకొస్తామని,పంచాయతీ కార్యదర్శి కీ చెప్పిన పట్టించుకోవడం లేదని వాపోయారు

## అక్రమంగా నిల్వచేసిన ఇసుక డాంపు సీజ్



**వాస్తవ నేస్తం,పోతంగాల్:** మండల కేంద్రంలోని మజీర వాగుపై ఉన్న రెండవ బిడ్జి దగ్గరలో 60 ట్రాక్టర్ ట్రిపుల అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేయడం జరిగింది. ఇట్టి ఇసుక డంపింగ్ ను రేపు తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేయడం జరుగుతుంది అని అన్నారు .ఇట్టి వేలంలో పల్గొనల్సినవారు 5 వేల రూపాయలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని తాసిల్దార్ మల్లయ్య తెలిపారు.

## బాపూజీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

**కొత్తగూడెం :** నేటి యువతరం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని స్ఫూర్తిగా తీసుకోని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు.శుక్రవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన జయంతి వేడుకలు సందర్భంగా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, అయనను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడుగా, తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. వారి సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. 1969వ సంవత్సరంలో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి అండగా దీక్షను చేయడమే కాకుండా తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసి ఉద్యమానికి అండగా నిలిచిన మహనీయులని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకై పోరాడిన యోధుడు తనకంటూ ఏమి లేకుండా బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి తన ఆస్తులు దానం చేసిన త్యాగశీలి అని కొనియాడారు. ఆయన తుది శ్వాస వరకు తెలంగాణ రాష్ట్ర సాధనకు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సేవలను గుర్తించి అనేక కార్యక్రమాలను అధికారికంగా జరపడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ అధికారి బి ఇందిరా, ఎల్ డి ఎం రామ్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ అధికారి వేల్పుల విజేత, కలెక్టరేట్ ఏవో రమాదేవి,బి.సి. సంఘ నాయకులు కొదుమూరి సత్యనారయణ , మోతుకురి ధర్మారావు , చిప్పా శ్రీనివాస రావు , గుమలాపురం సత్యనారయణ , కలెక్టరేట్ సిబ్బంది ,తదితరులు, పాల్గొన్నారు.

## సిద్ధిపేటలో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి

**సిద్ధిపేట :** సుడా పార్క్ వద్ద ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్ధిపేట శాసన సభ్యుడు హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ సేవలను ఆయన కొనియాడుతూ, ప్రజా సంక్షేమం కొరకు తన మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్త అని, తెలంగాణ తిరుగుబాటులో పాల్గొన్న భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు మరియు తెలంగాణ ఉద్యమకారుడని. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం పోరాడిన లక్ష్మణ్ బాపూజీ చిరస్మరణీయులుగా చరిత్రలో నిలిచిపో యారని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ, శ్రీనివాస్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగత్ కుమార్ రెడ్డి, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు కస్తూరి సతీష్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ బూర మల్లేశం, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కాముని రాజేశం, కార్యదర్శి బి. మల్లేశం, పట్టణ సెక్రటరీ చేర్యాల మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టండి

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లు డివిజన్ మండల అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది ప్రభుత్వం ఫైనల్ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించాలని కాంగ్రెస్ సర్కార్ ఆదేశించింది. అక్టోబర్ 7వ తేదీలోపు అన్ని ప్రభుత్వ కార్యాల యాల్లో ముఖ్యమంత్రి కొత్త ఫోటో ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, డివిజన్, మండల అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఫోటో నమూనాను కూడా విడుదల చేస్తూ ప్రభుత్వం కార్యాలయాల్లో సీఎం ఫోటో పెట్టాలని తెలిపింది. ఇప్పటికే కొందరు నాయకులు ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం ఫోటో లేదనే వాదనపై ప్రభుత్వం స్పందించింది. దీంతో వచ్చే నెల 7వ తేదీ వరకు గడువు ఇస్తూ ఆదే శించింది. అన్ని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు పూర్తి అయిన ఇప్పటి వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో లేకపోవడం గమనార్హం.

## రైతుల శ్రేయస్సుకు కలిసికట్టుగా పని చేద్దాం!

**సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు**

**కమాన్ పూర్ :** రైతుల శ్రేయస్సు కొరకు కలిసికట్టుగా పని చేద్దామని కమాన్ పూర్ వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు అన్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని పీ. ఏ. సీ. ఎస్ కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై సమీక్ష జరిపారు. అనంతరం పీ. ఏ. సీ. ఎస్ లో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఇందులో 560 మంది రైతులకు రుణమాఫీ రూ, 3కోట్ల 95 లక్షల 45 వేల 81 లు జరిగిందన్నారు. అలాగే రుణమాఫీయైన 468 మంది రైతులకు రూ, 3 కోట్ల 62 లక్షల 71 వేల రూపాయలు రుణం ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే కొత్తగా 103 మంది రైతులకు రూ, 80 లక్షల 59 వేల రుణం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే దీర్ఘకాలిక రుణాలు రూ, 51,40,000 ఇవ్వడం జరిగిందని తెలిపారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com